593) తోడి

ప॥ మెచ్చితిమి నిన్నును మేలు వాడవౌదువు। నిచ్చలు నా కన్నిటాను నీవే గురిగాక॥

చ॥ చేసుకొన్న మగడవు చేకొనక మానేవా। వాసితోడ రక్షించేదె వైపు గాక।
ఆస గొలిపినవాడ వట్టే రాక మానేవా। బాస దప్పకుండేదే పంతముగాక॥

చ॥ ప్రియమైనవిభుడవు బెరయక మానేవా॥ క్రియతో మన్నించుటే కీరితిగాక।
నియతమైనవాడవు నెట్టుకొనక మానేవా। జయముగా నేలుటే సంగతి గాక॥

చ॥ శ్రీవేంకటేశుడవు చేరి కూడక మానేవా। కైవసమై వుండినదే ఘనత గాక।
యీవల నన్నేలితివి ఇచ్చగించక మానేవా। యేవల్లా జన విచ్చుటే యెక్కుడుగాక॥